సీబీఐటీలో సాఫ్ట్ కంప్యూటింగ్ రీసెర్చ్ సొసైటీ ప్రారంభం



సీబీఐటీలో సాఫ్ట్ కంప్యూటింగ్ రీసెర్చ్ సొసైటీని ప్రారంభించిన అతిథులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో సాఫ్ట్ కంప్యూటింగ్ రీసెర్చ్ సొసైటీ స్టూడెంట్ చాప్టర్‌ను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా నిసా విజిటింగ్ ప్రొఫెసర్ ఎం. సాయిబాబా హాజరై మాట్లాడారు. 2013లో ఢిల్లీలో సాఫ్ట్ కంప్యూటింగ్ రీసెర్చ్ సొసైటీని స్థాపించారని, ఇందులో ఆసక్తి ఉన్న సంస్థలు, ల్యాబ్‌లు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు, పరిశోధనా నిపుణులతో కూడిన వారు ఉంటారని, ఇది లాభాపేక్ష లేని సంస్థ అన్నారు. సాఫ్ట్ కంప్యూటింగ్, సంబంధిత రంగాల్లో పరిశోధన ప్రయత్నాలను ప్రోత్సహించడం సొసైటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. యువ పరిశోధకులను ప్రోత్సహించేందుకు మార్గనిర్దేశం, ఉపన్యాసాలు, చర్చలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, ఐఅండ్‌ఐ సలహాదారు ప్రొఫెసర్ ఉమాకాంత్ చౌదరి, ఐటీ విభాగం అధిపతి ప్రొఫెసర్ రజనీకాంత్, విద్యార్థి విభాగం ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ టి. సత్యనారాయణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

‘తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం’



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా నాలుగేళ్లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టానని, అయినా తనపై కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలోనే బండ్లగూడను ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దానన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావివ్వకుండా కార్పొరేటర్లందరికీ నిధులు మంజూరు చేశానన్నారు. కొంత మంది కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల భర్తలు తనపై అసత్య, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, ఏదైనా తప్పు చేసినట్లు ఆధారాలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. కిస్మత్‌పూర్ సర్వే నంబర్ 181లో రెవెన్యూ అధికారులు చూపించిన హద్దుల్లోనే కార్పొరేషన్ కార్యాలయం నిర్మించామని, మిగిలిన స్థలం ఎక్కడ ఉంది..? ఎంత ఉన్నది రెవెన్యూ అధికారులే చూయిస్తారన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తే అందరికంటే ముందు తానే అడ్డుకుంటానన్నారు. గతంలో కార్పొరేషన్ భవనం ప్రహరీ రోడ్డులోకి వస్తుంది.. వెనక్కి జరిపి కట్టాలని పక్క కాలనీ వాసులు అడ్డుపడితే తాను వెళ్లి వారికి సర్దిచెప్పానని గుర్తు చేశారు. తనకు సంబంధం లేని విషయాలను ఆపాదిస్తూ ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ప్రేమాభిమానాలకు వేదికలు..
ఇఫ్తార్ విందులు

- పోటాపోటీగా ఏర్పాటు
- ఉనికి చాటేందుకు కొందరు.. పేదల సౌకర్యార్థం మరికొందరు
- కిక్కిరిసిపోతున్న కమ్యూనిటీ హాళ్లు, షాదీఖానాలు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న అక్బరుద్దీన్ ఓవైసీ (ఫైల్)

గోల్కొండ: ఇఫ్తార్ విందులు హైదరాబాద్ నగర చరిత్రలో ఒక భాగమయ్యాయి. శతాబ్దాల నుంచి హైదరాబాద్ నగర చరిత్రకు ఇఫ్తార్ విందులు ఒక కొత్త శోభను సంతరిస్తున్నాయి. గతంలో తమ మధ్య ఉన్న స్నేహ సంబంధాలను పటిష్టపరుచుకోవడానికి ఇఫ్తార్ విందులు ఇచ్చే వారని ప్రతీతి. రానురాను ఇఫ్తార్ విందులు రంజాన్ మాసంలో నగరానికి ఒక ప్రత్యేకతను చేకూరుస్తూ వస్తున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఈ ఇఫ్తార్ విందులు జరుగుతుండడం విశేషం. నేడు నగరంలో పోటా పోటీగా ఇఫ్తార్ విందులు జరగడం మనం అందరం చూస్తూనే ఉన్నాం. ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాల వారు వ్యాపార సంఘాల వారు ఇలా ఎవరికి తోచిన విధంగా వారు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నారు. కొందరూ తమ ఉనికిని చాటుకోవడానికి, మరి కొందరు సమాజ సేవ కోసం మరికొందరు ప్రజలు తమను గుర్తించడానికి ఇలా రకరకాలుగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు అవుతున్నాయి. నేడు వివిధ రాజకీయ పార్టీల వారు తమ తమ ప్రాంతాల్లో ప్రజలతో మమేకం కావడానికి ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నారు. కేవలం మసీదులకే కాకుండా ఇఫ్తార్ విందులు కాలక్రమేనా షాదీఖానాలు, ప్లేగ్రౌండ్‌లు, కమ్యూనిటీహాళ్లలో జరగడం ప్రారంభమైంది. ఇఫ్తార్ విందుల వేదికలు ప్రజల మధ్య ఉన్న ప్రేమాభిమానాలు పటిష్టం చేయడమే కాకుండా కొత్త వారితో పరిచయాలు చేసుకోవడానికి కూడా ఉపయోగపడుతున్నాయి. మొదట్లో కేవలం పండ్లు, పిండి వంటలు, హలీంలకే పరిమితమైన ఇఫ్తార్ విందులు, బిర్యానీతో పాటు ఇతర హైదరాబాదీ వంటకాలకు వేదికలుగా మారాయి.

యువతలో జోష్...

నేడు నగరంలో జరుగుతున్న ఇఫ్తార్ విందుల్లో ఎక్కువగా యువకులు, యువజన సంఘాల వారే ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న యువకులు, వ్యాపారంలో ఉన్న యువకులు కలిసికట్టుగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి స్థానికంగా అందరిని ఆహ్వానిస్తున్నారు. ఒకరకంగా తమ వ్యాపారాన్ని పెంచుకోవడమే కాకుండా యువకులు తమలో ఉన్న సేవా దృక్పథాన్ని చాటుకోవడానికి ఇఫ్తార్ విందుల ద్వారా ప్రయత్నిస్తున్నారు.

దశాబ్ద కాలంగా ఏర్పాటు చేస్తున్నాం..



సమాజ సేవ చేయడానికి ఇఫ్తార్ విందుల ఏర్పాటు మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. సమాజ సేవతో పాటు ఇఫ్తార్ విందుల వల్ల యువతకు గుర్తింపు కూడా లభిస్తుంది. ఇఫ్తార్ విందుల సమయంలో పేదలకు కూడా ప్రత్యేకంగా అన్నదానం చేస్తున్నాం. రంజాన్ మాసం రాగానే ఎంతో ఉత్సాహంతో స్నేహితులతో కలిసి ఇఫ్తార్ పార్టీలు గత దశాబ్దా కాలంగా ఏర్పాటు చేస్తున్నాం.

– ఇమ్రాన్ అలీఖాన్, గోల్కొండ

మతసామరస్యానికి వేదికలు..



ఇఫ్తార్ విందులు తమసామరస్యానికి వేదికలు హిందూ ముస్లింలు అంతా ప్రేమాభిమానాలతో పలకరించుకుంటూ ఇఫ్తార్ విందుల్లో పాల్గొనడం ఒక గొప్ప విషయం. గత నాలుగు దశాబ్దాలకు పైగా ఇఫ్తార్ విందుల ఏర్పాటులో భాగస్వామిగా ఉంటూ వస్తున్నా. ఈ సందర్భంగా హిందూముస్లిం అనే బేధం లేకుండా సహపంక్తి భోజనం చేసే అదృష్టం కలిగింది.

– సాయిబాబాచారి, జగదాంబిక అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు

పోటాపోటీగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శీలం వెంకట్ రెడ్డి



నూతనంగా ఎన్నికైన వెంకట్ రెడ్డి, శ్రీధర్ రెడ్డిని సన్మానిస్తున్న జడ్జి, న్యాయవాదులు



శీలం వెంకట్ రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం పోటాపోటీగా సాగాయి. ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానాలకు శీలం వెంకట్ రెడ్డి, డి.భూపాల్ వేర్వేరు ప్యానళ్లుగా పోటీ చేశారు. మొత్తం 136 ఓట్లు ఉండగా.. 134 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారిగా డి.ప్రవీణ్ కుమార్ వ్యవహరించారు. ఎన్నికల ఫలితాలను గురువారం సాయంత్రం ప్రకటించారు. కాగా రెండు వర్గాల వారు నెల రోజులుగా పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శీలం వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టి.ఎల్.శ్రీధర్ రెడ్డి గెలుపొందారు. అధ్యక్షుడిగా ఎన్నికైన శీలం వెంకట్ రెడ్డి, డి.భూపాల్‌పై 43 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ మేరకు నూతన కార్యవర్గ సభ్యులను రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి కోర్టు జడ్జి, పలువురు న్యాయవాదులు అభినందించారు.

జీఎన్ఐటీఎస్‌లో ఎన్ఎస్ఐసీ శిక్షణ క్యాంప్



శిక్షణ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

గోల్కొండ: ఔత్సాహికులు స్టార్టప్స్ ఏర్పాటుకు ముందుకు వస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి రుణ సదుపాయం ఉందని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉపకార్యనిర్వహణ అధికారి టి.ముత్తుకుమారన్ అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా కళాశాలలో ఎంట్రోప్రీనియర్‌షిప్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్ అనే అంశంపై ఒకరోజు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముత్తుకుమారన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగానే స్టార్టప్స్‌కు కూడా ప్రత్యేక రుణ సదుపాయం కల్పించిందన్నారు. మోటివేషనల్ స్పీకర్ జి.వాసు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మనో వికాసంతోనే ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఎందరో దేశవిదేశాల్లో అత్యున్నత ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఐసీకి చెందిన పి.అబ్దుల్‌ఖదీర్, డీన్స్ డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ కల్యాణి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ హిమబిందు, డాక్టర్ కె.వి.ధనలక్ష్మి, కె.వి.సౌమ్య, డాక్టర్ పద్మజ, వందన తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో అవినీతిపై ఉక్కుపాదం మోపాలి



ఏసీబీకి ఫిర్యాదు చేసిన లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాజేష్ నాయక్, డాక్టర్ రవీంద్ర నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అవినీతి నిరోధక శాఖ, రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్రనాయక్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం అండదండలతో మాజీ డైరెక్టర్ గడాల శ్రీనివాసరావు ఇచ్చిన వర్క్ ఆర్డర్‌లో భారీ అవినీతి జరిగిందని, ఇచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణ చర్యల్లో భాగంగా డిప్యూటేషన్ రద్దుచేసిందన్నారు. ప్రస్తుత డీహెచ్ రవీంద్రనాయక్ పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఉత్తర్వులు పాటించకుండా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆరోపించారు. అలాగే డిప్యూటేషన్లు రద్దు అయినప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారిగా ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఓ అధికారి అర్హత లేనప్పటికీ వివిధ హోదాల్లో పనిచేస్తుందన్నారు. ఈమెపై చర్యలు తీసుకోవాల్సిన డీహెచ్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.


కార్వాన్‌లో బీఆర్ఎస్ ఖాళీ?

గోల్కొండ: కార్వాన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మిత్ర కృష్ణ బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గురువారం ఆయన మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు రాజీనామా లేఖను పంపారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన జియాగూడ కార్పొరేటర్‌గా గెలిచారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కార్వాన్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. కాగా కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పూర్తిగా ఖాళీ అవుతుంది. పార్టీ ఆవిర్భావం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన టి.జీవన్‌సింగ్ సైతం గత వారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. బలమైన నాయకులు ఇద్దరి రాజీనామాతో కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఖాళీ అయినట్లే. జీవన్‌సింగ్‌తో పాటు మిత్ర కృష్ణ ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో చూడాల్సి ఉంది.

‘సండే ఈవెనింగ్ టాక్’

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ‘సండే ఈవెనింగ్ టాక్’ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ‘కాంప్రెహెన్సివ్ ఐ కేర్ అండ్ రైజ్ ఆఫ్ గ్లూకోమా’ అనే అంశంపై విన్ విజన్ ఐ ఆస్పత్రుల గ్లోకోమా అండ్ కెటరాక్ట్ సర్జన్, ఎంబీబీఎస్ గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ నిమిషా శర్మ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

‘నిథమ్’ అసిస్టెంట్ లైబ్రేరియన్‌కు పీహెచ్‌డీ



యాదగిరి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ‘నిథమ్’లో అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎస్.యాదగిరి పీహెచ్‌డీ డిగ్రీ సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని లైబ్రేరి అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం నుంచి పరిశోధక విద్యార్థి యాదగిరికి పీహెచ్‌డీ డిగ్రీ ప్రకటించారు. ఆయన ఢిల్లీ డీఆర్‌డీఓలోని డీఈఎస్ఐడీఓసీ డైరెక్టర్ డాక్టర్ కె. నాగేశ్వరరావు పర్యవేక్షణలో ‘తెలంగాణ రాష్ట్రంలోని టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ లైబ్రేరీలపై ప్రత్యేక అధ్యయనం’ అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్ సమర్పించగా దాన్ని పరిశీలించి, పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆయనను పర్యవేక్షణ చేసిన డాక్టర్ నాగేశ్వరరావు, నిథమ్ ఫ్యాకల్టీ, విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఏరియా ఆసుపత్రిలో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు 3 నెలలుగా జీతాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా తెలిపారు. గురువారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌కు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చాలా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని ఈ జీతాల కోసం ఈ నెల 26 నుంచి ఒక గంట నిరసన కార్యక్రమం తెలియజేస్తున్నామన్నారు.

హెచ్‌సీయూ–ఎన్ఎండీసీ మధ్య ఒప్పందం



ప్రతినిధులతో వైస్‌చాన్స్‌లర్ ప్రొ. బీజేరావు, ఎన్ఎండీసీ డైరెక్టర్ (ప్రొడక్షన్) దిలీప్‌కుమార్ మొహంతి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ–నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) మధ్య ఒప్పందం కుదిరింది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ద్వారా హెచ్‌సీయూ ఈ ఒప్పందం చేసుకుంది. భారతదేశంలో అతి పెద్ద ఇనుము ధాతువు ఉత్పత్తిదారు, నవరత్న పీఎస్‌యూతో ఒక అవగాహన ఒప్పందం ద్వారా గణనీయమైన భాగస్వామ్యాన్ని ఏర్పర్చుకోవడం విశేషం. అయిదు సంవత్సరాల కాలానికి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. హెచ్‌సీయూ నుంచి రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, ఎన్ఎండీసీ లిమిటెడ్ పక్షాన ఆర్ అండ్ డీ సెంటర్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్‌కే జైన్ హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సమక్షంలో వారిద్దరు సంతకాలు చేశారు. వీసీ ప్రొ. బీజేరావు, ఎన్ఎండీసీ డైరెక్టర్(ప్రొడక్షన్) దిలీప్ కుమార్ మొహంతి కలిసి సమర్థవంతంగా పనిచేయాలని, పరిశ్రమ–అకాడెమియా సహకారానికి విజయవంతమైన నమూనాగా మార్చడానికి ఇది మొదటి అడుగు అని చర్చించారు. హెచ్‌సీయూ నుంచి కోఆర్డినేటర్‌గా డాక్టర్ విజికొట్నూర్, ఎన్ఎండీసీ లిమిటెడ్ నుంచి డాక్టర్ విభూతి రోషన్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ ఎస్ఈఎస్‌టీ డీన్ ప్రొఫెసర్ జయప్రకాశ్‌గౌతమ్, ఫ్యాకల్టీ ప్రతినిధులు ప్రొఫెసర్లు వీవీఎస్ఎస్ శ్రీకాంత్, కేవీ రాజులపతి, డాక్టర్ వీజీ కొట్నూర్, ఎన్ఎండీసీ ప్రతినిధి డాక్టర్ విభూతి రోషన్ పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ నాయకులది అహంకార ధోరణి’



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్

గోల్కొండ: కాంగ్రెస్ నాయకులు అహంకారంతో వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సీనియర్ బీజేపీ నాయకుడు, బీజేపీ రాష్ట్ర ఎన్నికల క్యాంపెన్ ఇన్‌చార్జి దేవర శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన గుడిమల్కాపూర్‌లోని తన కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల ధోరణిని ఎండగట్టారు. చెంగిచెర్లలో బీజేపీ నాయకుడు బండి సంజయ్‌ను అరెస్టు చేయడం ఏమాత్రం పనికిరాని విషయమన్నారు. అదే విధంగా బుధవారం గుడిమల్కాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకుడు అజరుద్దీన్ కోడలు అన్నంమీర్జా నిర్వహిస్తున్న ఓ వ్యాపార కార్యక్రమానికి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఒక ఏసీపీతో సహా ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ స్వయంగా పరిశీలించారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు నామా యాదగిరి నేత తదితరులున్నారు.

ప్రాథమిక దశలోనే కేన్సర్‌ను గుర్తించాలి



డిజిటల్ మమ్మోగ్రఫీ స్క్రీనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నాంపల్లి: స్క్రీనింగ్ ద్వారానే కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించే అవకాశం ఉందని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. బ్రెస్ట్ కేన్సర్ పట్ల మహిళల్లో అంతగా అవగాహన లేదని, దానివల్ల బ్రెస్ట్ కేన్సర్ చివరి దశకు వచ్చే వరకు గుర్తించలేకపోతున్నారని తెలిపారు. గురువారం ఏసీ గార్డ్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో సువెన్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో రూ.64 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ మమ్మోగ్రఫీ స్క్రీనింగ్ సెంటర్‌ను డాక్టర్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సెంటర్‌లో మహిళలకు బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్రెస్ట్ కేన్సర్‌పై స్వచ్ఛంద సంస్థలు మహిళల్లో అవగాహన కల్పించాలని ఆయన కోరారు. బ్రెస్ట్ కేన్సర్ సేవలను పెంపొందించే గొప్ప ప్రయత్నంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంస్థ ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రితో కలిసి పనిచేసే అవకాశం లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నామని సువెన్ లైఫ్ సైన్సెస్ చైర్మన్ వెంకట్ జాస్తి అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు డాక్టర్ జ్యోతిరెడ్డి, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మంత్రి



వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొన్నం ప్రభాకర్, జ్ఞానేశ్వర్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేణుగౌడ్ కూతురు పావని, మహేశ్‌గౌడ్ వివాహం నార్సింగిలోని ఓం కన్వెన్షన్‌లో గురువారం జరిగింది. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

దుంప పంట సాగుపై శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మహిళా రైతులు

శంషాబాద్ రూరల్: వ్యవసాయంలో విలువ ఆధారిత ఉత్పత్తులు–మహిళా సాధికారతపై మండలంలోని మల్కారంలో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. కూరగాయల పరిశోధనా స్థానం కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అఖిల భారత దుంప పంటల సమన్వయ అభివృద్ధి పథకంలో భాగంగా ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జోనల్‌హెడ్ డాక్టర్ టి.సురేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ హెడ్ డాక్టర్ అనితాకుమారి, డాక్టర్ వి.సురేశ్, డాక్టర్ భాగ్యశాలి, ఏఈఓ పోతురాజు, రైతులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్‌ను తొలగించొద్దు



మణికొండ క్వార్టర్స్ వద్ద తొలగిస్తున్న బస్‌షెల్టర్

మణికొండ: బస్‌షెల్టర్ల తొలగించవద్దని మణికొండ క్వార్టర్స్ కాలనీ ప్రజలు కోరుతున్నారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నపుడు మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని క్వార్టర్స్ వద్ద బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయగా అవి ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు. అయితే ఇటీవల ఓ భవనం నిర్మించారని, అందులోని షాపులకు అడ్డుగా బస్‌షెల్టర్లు ఉన్నాయని తొలగిస్తుండడం తగదన్నారు. వాటి తొలగింపునకు మున్సిపల్ కమిషనర్ అనుమతులు ఇవ్వడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే వాటి తొలగింపును నిలిపివేయాలని కోరుతున్నారు.

జయంతి వేడుకలకు ఆహ్వానం



స్వామిగౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు హాజరు కావాలని రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు తెలంగాణ మొదటి శాసనమండలి మాజీ చైర్మన్ కనకమామిడి స్వామిగౌడ్, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గురువారం కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, పోయిల జీవన్ దాస్, కోరని దయానంద్, ఎడ్లకాడి సూర్యం, రగడంపల్లి శ్రావణ్, బండ్ల నరేందర్, జంగయ్య, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్



టిప్పర్ ఢీకొనడంతో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

శంషాబాద్ రూరల్: ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొనగా మహిళా ప్రయాణికురాలు గాయపడింది. మండలంలోని కాచారం శివారులో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ డిపో బస్సు షాబాద్ నుంచి అఫ్జల్‌గంజ్ వెళ్తుంది. మార్గ మధ్యంలో కాచారం వద్ద ఎదురుగా అతి వేగంతో వచ్చిన టిప్పర్ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా.. టిప్పర్ రోడ్డుపై బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న లింగారెడ్డిగూడెం వాసి మణెమ్మ (35)కు గాయాలయ్యాయి. వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారును ధ్వంసం చేసిన దుండగులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి తన కారును బుధవారం రాత్రి అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్ 29లో తన సోదరి ఇంటి ఎదుట నిలిపాడు. ఉదయం చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ విషయమై కార్పొరేటర్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.